ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017



అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాజర్



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- పట్టాలు తప్పి 18 డీజిల్ ట్యాంకర్లు దగ్ధం
- 900 టన్నుల డీజిల్ బుగ్గిపాలు
- పలు రైళ్ల రద్దు

తిరువళ్లూరు సమీపంలో తగలబడ్డ గూడ్సు రైలు



ప్రమాదస్థలంలో కలెక్టర్ ప్రదీప్, రైల్వేశాఖ ఉన్నతాధికారులు

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు రైల్వే స్టేషన్ సమీపం ఏకాట్టూరు వద్ద ఆదివారం ఉదయం డీజిల్ ట్యాంకర్లతో వెళుతున్న గూడ్సురైలు పట్టాలు తప్పటంతో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. చెన్నై మనలి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నుండి 52 ట్యాంకర్లలో డీజిల్ నింపుకుని గూడ్సురైలు ఆదివారం వేకువ జాము మైసూరు బయలుదేరింది. తిరువళ్లూరు రైల్వేస్టేషన్ దాటి వెళుతుండగా ఇంజన్ వెనుకనున్న మూడో ట్యాంకర్ దాని తర్వాత మరో రెండు ట్యాంకర్లు పట్టాలు తప్పాయి. దీంతో 70 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లు ఒక దానినొకటి ఢీకొనడంతో ఆ రాపిడికి నిప్పురవ్వలు చెలరేగి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. తొలుత ఓ ట్యాంకర్‌లో చెలరేగిన మంటలు ఆరు ట్యాంకర్ల వరకు వ్యాపించి ఆ ప్రాంతమంతటా మంటలు ఎగసిపడ్డాయి. ఆ తర్వాత వరుసగా వెనుకవైపు ఉన్న ట్యాంకర్లకు కూడా నిప్పుమంటలు వ్యాపించాయి. మొత్తం 18 ట్యాంకర్లలోని డీజిల్ దగ్ధం కావటంతో ఆ ప్రాంతం అంతటా మేఘల్లా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. ఓ వైపు ఆకాశాన్నంటేలా చెలరేగుతున్న నిప్పుమంటలు, మరో వైపు దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ ప్రాంతంలో వాయుకాలుష్యం కూడా అధికమైంది. సమాచారం అందుకుని తిరువళ్లూరు, గుమ్మిడిపూండి సిప్కాట్ తదితర ప్రాంతాల నుండి అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లలో హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలను ఆర్పే రసాయనాలను పిచికారీ చేశారు. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న రాష్ట్ర మంత్రి నాజర్, తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రదీప్, ఎస్పీ శీనివాసపెరుమాళ్, దక్షిణ రైల్వే చెన్నై జోన్ అధికారి విశ్వనాథ్ ఈర్యా, రైల్వే ఐజీ రామకృష్ణన్, ఎస్పీ ఈశ్వరన్ తదితర అధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాద స్థలానికి చేరువగా నివసిస్తున్న సంచార జాతులకు చెందిన 50 కుటుంబాలను పెరియకుప్పం ప్రాంతంలోని పంచాయతీ పాఠశాలకు తరలించారు. ఈ ప్రమాదం కారణంగా రైలు మార్గంలోని సిగ్నల్ బోర్డులు, విద్యుత్ కనెక్షన్లు దెబ్బతిన్నాయి. చెన్నై - అరక్కోణం మార్గంలో చెన్నై వైపు వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను అరక్కోణం తదితర ప్రాంతాల్లో నిలిపివేశారు. చెన్నై నుంచి జోలార్‌పేట, మైసూరు తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను కూడా రద్దు చేశారు. ఈ భారీ అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు...

ఇదిలా ఉండగా తిరువళ్లూరు సమీపంలో గూడ్సురైలులో సంభవించిన అగ్ని ప్రమాదం కారణంగా ఎనిమిది ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే అధికారులు ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం వేకువజామ 5.50 గంటలకు చెన్నై నుండి మైసూరు బయలుదేరాల్సిన వందే భారత్ రైలు, ఉదయం 6 గంటలకు చెన్నై నుంచి మైసూరు వెళ్లాల్సిన శతాబ్ది ఎక్స్‌ప్రెస్, ఉదయం 6.10 గంటలకు చెన్నై నుంచి బయలుదేరాల్సిన కోవై ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. ఇదే విధంగా చెన్నై నుండి ఉదయం 7.15 గంటలకు కోవై బయలుదేరాల్సిన శతాబ్ది ఎక్స్‌ప్రెస్, ఉదయం 6.25 గంటలకు చెన్నై నుండి తిరుపతి బయలుదేరే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైలు, చెన్నై నుంచి ఉదయం 7.25 గంటలకు బెంగళూరుకు బయలుదేరాల్సిన డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, చెన్నై నుండి ఉదయం 7.40 గంటలకు బెంగళూరుకు వెళ్ళాల్సిన బృందావన్ ఎక్స్‌ప్రెస్, చెన్నై నుండి ఉదయం 9.15 గంటలకు మహారాష్ట్రలోని నాగర్‌సోల్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు.

విపత్తుల నివారణ బృందం..

ఈ ప్రమాదంలో మంటలను ఆర్పేందుకు అగ్నిమాక సిబ్బంది తీవ్రంగా పోరాడినా మంటలు అదుపులోకి రాలేదు. దీనితో అరక్కోణం నుండి విపత్తుల నిర్వహణ బృందానికి చెందిన 60 మంది రెండు బృందాలుగా బయలుదేరి ప్రమాద స్థలానికి చేరాయి. తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి మేరకు వీరు మంటలను ఆర్పేందుకు సాయం చేశారు. ఉదయం ఆరుగంటల ప్రాంతంలో ప్రారంభమైన మంటలు ఆర్పడం మధ్యాహ్నం ఒంటి గంట దాకా కొనసాగింది

సహాయకచర్యల్లో మంత్రి నాజర్..

ఈ ప్రమాదం గురించి తెలియగానే మంత్రి నాజర్, కలెక్టర్ ప్రదీప్, ఎస్పీ శీనివాస పెరుమాళ్ హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్ళి సహాయక చర్యలు చేపట్టారు. ట్యాంకర్ల నుంచి వచ్చే మంటలు సమీప ప్రాంతాల్లో ఉన్న సంచార జాతులవారు నివసిస్తున్న ఇళ్ళకు వ్యాపించకుండా తగు చర్యలు చేపట్టారు. ఇళ్లలోని వారికి ఆహారం పంపిణీ చేశారు. ఇళ్లలో ఉన్న గ్యాస్ సిలిండర్లను దూరంగా తీసుకెళ్ళారు.

ప్రత్యేక బస్సులు..

తిరువళ్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో తిరువళ్లూరు నుంచి చెన్నై నగరానికి, అదే విధంగా చెన్నై నుండి అరకోణంకు విద్యుత్ రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి.రాష్ట్ర రవాణా సంస్థ రోజూ రైలులో ప్రయాణించేవారికి ఇబ్బంది లేకుండా తిరువళ్లూరు నుంచి చెన్నై, అరక్కోణం మార్గంలో 10 ప్రత్యేక బస్సులను నడిపారు.

హెల్ప్‌లైన్... : గూడ్సురైలు ప్రమాదం కారణంగా చెన్నై నుండి ఇతర నగరాలకు బయలుదేరాల్సిన రైళ్లు రద్దయ్యాయి. ఇతర నగరాల నుండి చెన్నైకి రావాల్సిన రైళ్లు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. రైళ్ల రద్దు, పలు ప్రాంతాల్లో నిలిచిపోయిన రైళ్లకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకుగాను దక్షిణ రైల్వే 044-25354151, 044-24354995 అనే ఫోన్ నెంబర్లను హెల్ప్‌లైన్‌లుగా ఏర్పాటు చేసింది.

శాంతి భద్రతల పరిరక్షణలో
డీఎంకే విఫలం

- టీవీకే ధర్నాలో విజయ్ విమర్శ



ప్లకార్డు ప్రదర్శిస్తున్న విజయ్

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడటంలో డీఎంకే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు, నటుడు విజయ్ విమర్శించారు. శివగంగ జిల్లా మడప్పురం, తిరుభువనం పోలీస్‌స్టేషన్‌లో ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్ లాకప్‌డెత్ సంఘటనపై న్యాయం కోరుతూ ఆదివారం చేపాక్ స్వామి శివానందసాలైలో విజయ్ నాయకత్వంలో నిర్వహించిన ధర్నాలో ఆ పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో ప్లకార్డులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, అన్ని వ్యవహారాల్లో న్యాయస్థానం జోక్యం కలుగజేసుకోవాలని కోరడం సరికాదని, అలాగైతే రాష్ట్రంలో ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో సాతాన్‌కుళంలో జయరాజ్, ఫెనిక్స్ అనే తండ్రీకొడుకుల లాకప్‌డెత్ కేసు సీబీఐకు అప్పగించడం అవమానం అని విమర్శించిన డీఎంకే, ప్రస్తుతం అజిత్‌కుమార్ కేసును సీబీఐకి బదిలీ చేయడం న్యాయమేనా అని అని స్టాలిన్‌ను ప్రశ్నించారు. ప్రజల హక్కుల కోసం ఆందోళన జరుపుకునేందుకు ప్రతిపక్షాలకు కఠిన నిబంధనలు విధించడం సరికాదన్నారు. అన్నా వర్సిటీ విద్యార్థిని కేసునుంచి అజిత్‌కుమార్ కేసు వరకు అన్నింటిలో న్యాయస్థానం జోక్యం చేసుకుని రాష్ట్రప్రభుత్వాన్ని నిలదీసిందని, అన్ని వ్యవహారాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే ఇక ప్రభుత్వం ఎందుకుందని విజయ్ ప్రశ్నించారు. టీవీకే ధర్నా కారణంగా స్వామిశివానందసాలై పరిసర ప్రాంతాల్లోని రహదారుల్లో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేసి, పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించారు. ఇదిలా వుండగా, టీవీకే ధర్నాలో పాల్గొనేందుకు ఇతర జిల్లాల నుంచి వాహనాల్లో నగరానికి వస్తున్న ఆ పార్టీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో పోలీసులకు వ్యతిరేకంగా అన్నాసాలై సిమ్సన్ జంక్షన్‌లో టీవీకే కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించిన వారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు.



ధర్నాలో నలుపు రంగు దుస్తులతో పాల్గొన్న విజయ్

పెరుగుతున్న ప్రజాదరణ అయినా విజయం కోసం శ్రమిద్దాం

- డీఎంకే శ్రేణులకు స్టాలిన్ పిలుపు



చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల డీఎంకే ప్రభుత్వ పనితీరును ప్రజలంతామెచ్చుకుంటున్నారని, రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతూనే ఉందని, అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలలో విజయం కోసం తీవ్రంగా కృషి చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం అరివాలయంలో పార్టీశ్రేణులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ప్రజాదరణ పెరుగుతుండటంతో బాధ్యతలు కూడా అధికమవుతున్నాయని, అందరూ సమష్టిగా ప్రజా సేవ చేయాలని, అప్పుడే ఎన్నికల్లో విజయం సాధ్యం కాగలదన్నారు. 234 నియోజకవర్గాలలో 68 వేల మందికిపైగా పోలింగ్ బూత్ నిర్వాహకులుగా నియమించబడిన యువకులకు జిలా నేతలు, స్థానిక నేతలు శిక్షణ ఇవ్వాలని చెప్పారు. డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ప్రచారం చేయాలని, పథకాల వివరాలతో ముద్రించి సరఫరా చేసిన కరపత్రాలను ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు, మహిళలు, రైతులు, కార్మికులను పార్టీ స్థానిక నాయకులు తరచూ కలుసుకొని వారి సమస్యలు పరిష్కరించేందుకు కృష చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ప్రజాభిమానం ఉన్న వారినే అభ్యర్థులుగా బరిలోకి దింపుతామని, వారిని గెలిపించాల్సిన గురుతర బాధ్యతల స్థానిక నాయకులేదనని, ప్రత్యేకించి జిల్లా శాఖ కార్యదర్శులదేనని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీకి చెందిన అన్ని విభాగాల నాయకులు కలిసికట్టుగా ఎన్నికల ప్రచారం చేస్తే 200లకు పైగా సీట్లలో గెలవాలనే లక్ష్యాన్ని సాధించగలమని అన్నారు.

బీజేపీది ఫాసిస్ట్ పాలన

- డిప్యూటీ సీఎం ఉదయనిధి

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్ట్ పాలన నడుపుతోందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ విమర్శించారు. తిరువణ్ణామలై డీఎంకే ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నిర్వాహకుల సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలోని కొన్ని పార్టీలు ఇంకా బూత్ ఏజెంట్లను కూడా నియమించుకోలేక సతమతమవుతున్నాయని, అయితే డీఎంకే తరుపున బూత్ ఏజెంట్ల శిక్షణ ఒక మహానాడులా ఏర్పాటు చేయగలిగామని తెలిపారు. పార్టీకి ఓట్ల రూపంలో బలాన్ని చేకూర్చగలిగే సత్తా ఉన్నవాళ్ళు పోలింగ్ బూత్ ఏజెంట్లేనని, వీరు ప్రభుత్వ పథకాలను కూడా ఇంటింటికి తీసుకెళ్ళాలని ఆయన సూచించారు. మహిళలు ఉన్నత విద్యలో రాణించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి స్టాలిన్ రూపొందించిన పథకం 'పుదుమైపెన్' అని దీనికి మంచి స్పందన వస్తోందన్నారు. బీజేపీది ఫాసిస్ట్ పాలన అయితే అన్నాడీఎంకేది బానిసత్వ మోడల్ పాలన అని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే-బీజేపీ కూటమికి డిపాజిట్లు కూడా దక్కవని ఉదయనిధి ఎద్దేవా చేశారు. అనంతరం తిరువణ్ణామలై తెన్మాతూరులో రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థ తరుపున మహిళలు ఉచితంగా ప్రయాణం చేసే బస్సులు, నాలుగు రూట్లలో కొత్త ఏసీ బస్సు సేవలను ఉదయనిధి పచ్చజెండా ఊపి ప్రారంభించారు.



కొత్త బస్సు సేవలను ప్రారంభిస్తున్న ఉదయనిధి

డీఎంకే నిలిపివేసిన పథకాలు
మళ్లీ తీసుకొస్తాం

- ప్రజలకు ఈపీఎస్ హామీ

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం నిలిపివేసిన అన్నాడీఎంకే పథకాలను తాము అధికారంలోకి వచ్చాక మళ్ళీ తీసుకురానున్నట్లు ప్రతిపక్షనేత, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి హామీ ఇచ్చారు. కడలూరులో ఆదివారం ఉదయం ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, డీఎంకే పాలనలో పెంచిన విద్యుత్ ఛార్జీల గురించి వింటేనే షాక్ కొడుతుందని విమర్శించారు. అదేవిధంగా రూ.3వేలకు విక్రయించిన యూనిట్ ఎంశాండ్ ధర ఒక్కసారిగా రూ.5,500లకు పెంచారని, ఇందువల్ల సామాన్యులు సొంతిల్లు కట్టలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అమలులో ఉన్న ధరల పట్టికను, ప్రస్తుత ధరల పట్టికను పరిశీలిస్తే ఎవరి పాలన ప్రజలకు మంచి చేసిందో అర్థమవుతుందన్నారు. దివంగత మాజీముఖ్యమంత్రి జయలలిత చదువుకున్న యువతుల వివాహానికి మంగళసూత్రానికి బంగారాన్ని ఉచితంగా అందించే పథకం ప్రవేశపెట్టి చరిత్రలో నిలిచిపోయారని, ఈ పథకాన్ని డీఎంకే ప్రభుత్వం అటకెక్కించిందని, తమకు మళ్ళీ అధికారం కట్టబెడితే ఆ పథకాలతో పాటు కొత్త వాటిని కూడా అమలుపరచనున్నట్లు ఈపీఎస్ కడలూరు రోడ్‌షోలో తెలిపారు.

24 నుంచి రెండో విడత ప్రచారయాత్ర...

'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' పేరిట అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి చేపట్టనున్న రెండో విడత ప్రచారయాత్ర వివరాలను అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఆదివారం విడుదల చేసింది. రెండో విడత యాత్ర 24 నుంచి ప్రారంభమై ఆగస్టు 8 వరకు ఉంటుందని తెలిపారు. ఈపీఎస్ విరుదునగర్, తెన్‌కాశి, తిరునల్వేలి, తూత్తుకుడి, రామనాథపురం, శివగంగ, పుదుకోట జిల్లాల్లోని నియోజకవర్గాలో పర్యటిస్తారు. ఇందులో ఆయా ప్రాంతాలకు చెందిన అన్నాడీఎంకే నిర్వాహకులు ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలు, రోడ్‌షోలో ఈపీఎస్ పాల్గొంటారు.

అన్నాడీఎంకేతోనే ఎన్నికల పొత్తు!

- పీఎంకే ఎమ్మెల్యే సదాశివం



ఓమలూరులో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సదాశివం

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతోనే తమ పార్టీ పొత్తు పెట్టుకుంటుందని పీఎంకే ఎమ్మెల్యే సదాశివం ప్రకటించారు. ప్రస్తుతం పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఆయన తనయుడు డాక్టర్ అన్బుమణి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సాగుతున్న విషయం తెలిసిందే. పార్టీలో ప్రస్తుతం రెండు వర్గాలున్నప్పటికీ ఆ రెండు వర్గాలకు నాయకత్వం వహిస్తున్న రాందాస్‌గానీ, అన్బుమణి గానీ అసెంబ్లీ ఎన్నికల పొత్తు విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. రాందాస్ మాత్రం ఈసారి పీఎంకేతో పొత్తుపెట్టుకునే పార్టీయే అధికారంలో వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం సేలం జిల్లా ఓమలూరులో పీఎంకే నిర్వాహకుల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో పాల్గొన్న పార్టీ ఎమ్మెల్యే సదాశివం సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతూ వన్నియార్లకు 10.5 శాతం అంతర్గత రిజర్వేషన్లను అమలు చేసిన ఘనత అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికే దక్కిందని, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ రిజర్వేషన్ సక్రమంగా అమలు చేయలేకపోతున్నదని ఆరోపించారు. వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ఈపీఎస్ నాయకత్వంలో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే అవకాశాలుండటంతో పీఎంకే ఆ పార్టీతోనే పొత్తు పెట్టుకోవాల్సి ఉందని చెప్పారు.

ఆగని శ్రీలంక నావికాదళం దాడులు

- ఏడుగురు రామేశ్వరం జాలర్ల అరెస్టు



శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన రామేశ్వరం జాలర్లు

టి.నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తమిళజాలర్లపై శ్రీలంక నావికాదళం మరోమారు విరుచుకుపడింది. తమ దేశ సముద్రజలాలల్లో అక్రమంగా ప్రవేశించారనే ఆరోపణలతో రామేశ్వరం జాలర్లపై దాడులకు జరిపారు. పడవలోని వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి తరలించారు. ఆదివారం వేకువ జాము నెడు దీవి వద్ద చేపలుపడుతున్న రామేశ్వరం ప్రాంతానికి చెందిన ఏడుగురు జాలర్లపై విచక్షణా రహితంగా దాడులు జరిపిన శ్రీలంక నావికాదళం వారిని అరెస్టు చేసి శ్రీలంకలోని మన్నార్ ప్రాంతానికి తరలించింది.. ఈ విషయమై రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులు స్థానిక మత్స్యశాఖ ఉన్నతాధికారులకు పిర్యాదు చేశారు.

సమాచార ధ్వని

నేడు వెటర్నరీ కోర్సుల ర్యాంకుల జాబితా విడుదల

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కోర్సుల అడ్మిషన్లకు సంబంధించిన ర్యాంకుల జాబితా సోమవారం విడుదల కానుంది. ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు https://adm.tanuvas.ac.in, https://tanuvas.ac.in అనే వెబ్‌సైట్ల ద్వారా తమ ర్యాంకు తెలుసుకోవచ్చని, కౌన్సెలింగ్ తేది తదుపరి ప్రకటించనున్నట్లు తమిళనాడు వెటర్నరీ వైద్య విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

హొగెనేకల్ కావేరీలో దోనెల సవారీకి అనుమతి

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): హొగెనేకల్ కావేరి నదిలో దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతిచ్చింది. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, కర్ణాటక రాష్ట్రంలోని కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంల నుంచి అదనపు జలాలు కావేరి నదిలోకి వదిలారు. ఈ నీరు హొగెనేకల్ కు వస్తుండడంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా దోనెల సవారీ నిలిపివేశారు. 22 రోజుల అనంతరం హొగెనేకల్‌కు వచ్చే నీటి పరిణామం 20వేల ఘనపుటడుగులకు తగ్గడంతో ఆదివారం నుంచి దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతులు ఇచ్చింది.

రేపు, 16న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శుభముహూర్తపు రోజులైన సోమ, బుధవారాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు అందజేయనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, ఒక సబ్ రిజిస్ట్రార్ ఉన్న కార్యాలయంలో ఇస్తున్న 100 టోకెన్లకు బదులు 150, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్న కార్యాలయాల్లో 200లకు బదులు 300 టోకెన్లు ఇవ్వనున్నారు. అలాగే, తత్కాల్ విధానంలో అదనంగా 4 టోకెన్లు అందజేయనున్నారు.

మూడేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీ

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో, ఒకే శాఖ, ఒకే ఉద్యోగంలో మూడేళ్లకు పైగా పనిచేస్తున్న వారిని, ఇతర ప్రాంతాలకు మార్చాలని బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్లకు సహకార సంఘాల రిజిస్ట్రార్ నందకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో 23 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు 933 శాఖా కార్యాలయాలుండగా, వివిధ విభాగాల్లో సుమారు 2,500 మంది పనిచేస్తున్నారు. వారిలో పలువురు ఒకే శాఖలో, ఒకే విభాగంలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నారు. అందువల్ల మూడేళ్లకు పైగా ఒకే శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర శాఖా కార్యాలయాలకు బదిలీ చేయాలని సహకార శాఖ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు.

14,700 మంది జాలర్లకు శిక్షణ

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో, స్క్యూబా డైవింగ్, సెల్‌ఫోన్ రిపేర్ సహా 12 శిక్షణ కోర్సులు అందిస్తున్నారు. ప్రస్తుతం 14,700 మందికి తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ అందించనున్నారు. రామనాధపురం, తంజావూరు, తిరువారూరు, పుదుకోట, నాగపట్టణం, తూత్తుకుడికి చెంది శిక్షణలో చేరేందుకు ఆసక్తి ఉన్న జాలర్లు తమ సమీపంలోని మత్స్యశాఖ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

27న చెన్నై తెలంగాణ బోనాల పండుగ

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ జరుపుకోనున్నారు. మూడో సంవత్సరంగా ఆదివారం ఉదయం 9.20 గంటలకు షావుకారుపేట సమీపంలోని మింట్‌స్ట్రీట్ రేణుకా పరమేశ్వరి (చిన్న కడమ్మన్‌కోవిల్) ఆలయం నుంచి కొండితోపు పార్కు సమీపంలోని రాతినంవీధిలో ఉన్న ఆదిశక్తి అమ్మవారి ఆలయం వరకు ఒగ్గు కళాకారులతో బోనాల జాతర జరుగుతుంది. కులమతాలకతీతంగా సంప్రదాయ వస్త్రధారణతో తెలంగాణ వాసులు, ఆడపడుచులు పాల్గొనాలని సంఘ అధ్యక్షులు ఎం.పరుశురాములు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, కోశాధికారి ఎస్‌కే షఫీలు పిలుపునిచ్చారు.

పాఠశాలల్లో 'ప' ఆకారంలో సీటింగ్ ఉత్తర్వులు నిలిపివేత

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి పాఠశాలల్లో 'ప' ఆకారంతో సీటింగ్ ఏర్పాటుచేయాలని ఉత్తర్వులు పాఠశాల విద్యాశాఖ తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ ప్రక్రియను కొందరు స్వాగతించగా, మరికొందరు వ్యతిరేకించారు. తరగతి గదిలో 'ప' ఆకారంలో సీటు కల్పించేందుకు తగినంత స్థలం లేదని, అలాగే, ఫ్యాను కూడా లేదని, విద్యార్థులు ఎక్కువ సేపు అలా కూర్చుంచే చాలాసేపు పక్కన చూడాల్సి వస్తుందని, అందువల్ల మెడనొప్పి, బాలికలకు నడుము నొప్పి వచ్చే అవకాశాలున్నాయని పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో, పాఠశాల తరగతి గదిలో 'ప' ఆకారంలో సీటింగ్ ఏర్పాటుచేయాలనే ఉత్తర్వులు తాత్కాలికంగా నిలిపివేశారు.

15న పాఠశాలల్లో 'విద్యాభివృద్ధి దినోత్సవం'

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి కామరాజర్ జయంతి సందర్భంగా ఈ నెల 15న ప్రభుత్వ పాఠశాలల్లో 'విద్యాభివృద్ధి దినోత్సవం' నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కన్నప్పన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కార్యక్రమం కోసం పాఠశాల తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల కమిటీ నిధుల నుంచి ప్రభుత్వ మహోన్నత పాఠశాలలు రూ.1,500, ఉన్నత పాఠశాలలు రూ.1,000, మాధ్యమిక, ప్రాథమిక పాఠశాలలు రూ.500 చొప్పున వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మెరుగైన విద్యా బోధన, ఉత్తీర్ణ శాతం, డ్రాపౌట్స్ లేకుండా చూడడం, తదితరాలు ఆధారంగా ఉత్తమ పాఠశాలలు ఎంపిక చేసి కామరాజర్ పురస్కారం అందజేయనున్నారు. పురస్కారానికి ఎంపికైన ప్రాథమిక పాఠశాలలకు రూ.25,000, మాధ్యమిక పాఠశాలలకు రూ.50,000, ఉన్న త పాఠశాలలకు రూ.75,000, మహోన్నత పాఠశాలలకు రూ. లక్ష అందించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

ఘనంగా శక్తిఅమ్మ 50వ జన్మదిన వేడుకలు

వేలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని తోటపాళయంలో ఆదివారం ఉదయం నారాయణి పీఠం పీఠాధిపతి శక్తిఅమ్మన్ 50వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రముఖ వైద్యుల ఆధ్వర్యంలో సుమారు వైద్యపరీక్షలు నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ వైద్యశిబిరంలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవల్సిందిగా ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 6385410853 నెంబరును సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

బలహీనవర్గాల అభివృద్ధే నా లక్ష్యం

● ఎమ్మెల్యే ఎస్.చంద్రన్




గిరిజనులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే - చీకటిలో చదువుతూ

తిరుత్తణి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి పరిసర ప్రాంతాల్లోని గిరిజన కాలనీలను శనివారం రాత్రి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ పరిశీలించారు. గత కొన్ని నెలలుగా తిరుత్తణిలోని గిరిజనులు తమ గ్రామాలకు కనీస వసతులు లేవని, తాగునీరు, విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామంటూ కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే చంద్రన్ ఫోన్ ద్వారా గిరిజనులతో మాట్లాడి, ఒక రోజు రాత్రి నేను మీ గ్రామంలో బస చేస్తానని తెలిపారు. దీనికి సమ్మతించిన గ్రామస్తులు ఆయనను సాదరంగా ఆహ్వానించగా, శనివారం రాత్రి ఆయన గిరిజన గ్రామానికి వెళ్ళి వారి జీవనశైలి, వారికి కావల్సిన వసతులపై అవగాహన కోసం వారితో కలిసి భోజనం, చేసి విద్యార్థులు, గ్రామ పెద్దలను కలిసి గ్రామ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ, బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యమని, గిరిజన గ్రామాభివృద్ధికై సత్వర చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. త్వరలోనే గ్రామానికి విద్యుత్ సరఫరా, పిల్లలకు అందుబాటుగా పాఠశాల నిర్మాణం తదితర నూతన పనులను ప్రారంభిస్తామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

16 నుంచి అందుబాటులోకి పంచపూర్ బస్ టెర్మినల్

● మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి పంచపూర్‌లో ఆధునిక టెక్నాలజీతో నిర్మించిన బస్ టెర్మినల్ ఈ నెల 16వ తేదీ బుధవారం నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని మంత్రి కేఎన్ నెహ్రూ పేర్కొన్నారు. తిరుచ్చి నగరంలో వాహనాల రద్దీ నియంత్రించే దిశగా తిరుచ్చి-మదురై-చెన్నై జాతీయ రహదారిలోవున్న పంచపూర్ అనే ఊరిలో కొత్త బస్ టెర్మినల్ నిర్మించారు. ఒకే సమయంలో సుమారు 400 బస్సులు నిలిపే సదుపాయం కల్పించారు. సిటీ బస్సుల కోసం 56 బస్ షెల్టర్లు, దూర ప్రాంతాల బస్సులకు 141, ఇతర బస్సులు వచ్చివెళ్ళేందుకు 120 బస్ షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా 1,935 ద్విచక్రవాహనాలు, 216 కార్లు, వంద ఆటోలు పార్కింగ్ చేయవచ్చు. ఈ బస్టాండులో ఏసీ సదుపాయం కూడా ఉంది. అన్ని వసతులతో కూడిన పంచపూర్ బస్ టెర్మినల్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ మే 9న ప్రారంభించిన నేపథ్యంలో వచ్చే బుధవారం నుంచి బస్ సర్వీసులు ప్రారంభమవుతాయని మంత్రి కేఎన్ నెహ్రూ ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రకటించారు. తిరుచ్చిలో ఇప్పటికే ఉన్న సత్రం బస్‌స్టేషన్, సెంట్రల్ బస్‌స్టేషన్లు యథావిధిగా పనిచేస్తాయని, ప్రైవేటు బస్సులను కూడా ఈ మూడు బస్ స్టేషన్లలో అనుమతిస్తామని మంత్రి తెలిపారు.

షోళింగర్ ఆలయంలో తమిళిసై



తమిళిసై సౌందరరాజన్‌ను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

తిరుత్తణి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని షోళింగర్‌లో ప్రసిద్ధి చెందిన యోగా నరసింహస్వామిని తెలంగాణ మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందన్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని నరసింహస్వామిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం తమిళిసైకు ఆలయ అర్చకులు, నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆనందన్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి సోనియా, నియోజకవర్గ అధ్యక్షుడు కార్తీ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి డ్యాం కాలువలో దిగి రైతుల వినూత్న నిరసన

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా ఉడుమలై ప్రాంతంలోని నీటివనరులశాఖ అధికారుల వైఖరికి నిరసనగా అమరావతి డ్యాం కాలువలో దిగి రైతులు వినూత్న నిరసన తెలిపారు. అమరావతి డ్యాం కొత్త ఆయకట్టు సాగుప్రాంతంలో సుమారు 20వేలకు పైగా భూములకు సాగునీరు సరఫరా అవుతోంది. ఈ నేపథ్యంలో, అమరావతి పరసరాల్లోని ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అమరావతి డ్యాం పూర్తిస్థాగా నిండింది. దీంతో జలవనరులశాఖ అధికారులు ప్రధాన కాలువ ద్వారా 450 ఘనపుటడుగుల మిగులు జలాలను విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, డ్యాం పరిధిలో లేని ప్రాంతాలకు ఓ అధికారి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సాగునీటి విడుదలపై అమరావతి ప్రాంత రైతులు అధికారులను నిలదీసినా ఎటువంటి సమాధానం లేదని తెలిసింది. దీనితో అధికారుల వైఖరిని తప్పుబడుతూ శనివారం నీటిలో దిగి రైతులు నిరసన తెలిపారు.


చక్కెర కర్మాగారంలో కలెక్టర్ తనిఖీలు



కర్మాగారంలోని యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడులో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ పనులు ఈ ఏడాది అక్టోబర్ రెండో వారంలో ప్రారంభంకానున్నాయి. దీంతో తిరువలంగాడు సమీపంలోని ఏడు సబ్ డివిజన్ల నుండి రైతులు షుగర్ ఫాక్టరీకి చెరుకు తరలించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో, షుగర్ ఫ్యాక్టరీలో జరుగుతున్న యంత్రాల మరమ్మతుల పనులపై కలెక్టర్ ప్రతాప్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరుకు రైతుల కోరిక మేరకు ఈ ఏడాది అక్టోబర్ రెండో వారంలో క్రషింగ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా 2 లక్షల టన్నుల క్రషింగ్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. క్రషింగ్ కోసం చెరుకు తరలించే రైతులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

మేట్టూరు డ్యాం నుంచి నిలిపివేసిన నీరు



నీటిని నిలిపివేడయంతో బయల్పడిన బండరాళ్లు

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు డ్యాం నుంచి 16 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదల చేస్తున్న అదనపు జలాలను ఆదివారం ఉదయం నిలిపివేశారు. అదే సమయంలో, డెల్టా సాగు కోసం 22,500 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. కావేరి నది పరీవాహక ప్రాంతాలు, కర్ణాటక రాష్ట్రంలోని కబిని, కృష్ణరాజసాగర్ నుంచి వస్తున్న అదనపు జలాలతో సేలం జిల్లా మేట్టూరు డ్యాం గత నెల 29వ తేది 44వ సారిగా పూర్తి సామర్థ్యం 120 అడుగులకు చేరింది. డెల్టా సాగుకు నీటిని విడుదల చేస్తుండడంతో తగ్గిన నీటిమట్టం, మళ్లీ ఈ నెల 5వ తేది ఈ ఏడాది రెండో సారి పూర్తి స్థాయికి చేరింది. డ్యాం భద్రత దృష్ట్యా డ్యాంకు వచ్చే అదనపు జలాలు అదే స్థాయిలో దిగువకు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో, డ్యాంకు చేరుతున్న అదనపు జలాలు తగ్గడంతో, 15 రోజుల తర్వాత ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో క్రస్ట్‌గేట్ల ద్వారా అదనపు జలాల విడుదల నిలిపివేశారు.

ఆన్‌లైన్ జూదంలో డబ్బు పోగొట్టుకుని మహిళ ఆత్మహత్య



స్టెల్లా ఎస్తర్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జూదంలో నగదు కోల్పోయిన మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెన్‌కాశి జిల్లాలో చోటుచేసుకుంది. అలంకుళం సీఎస్ఐ నగర్‌కు చెందిన అరుణ్ పాండి-స్టెల్లా ఎస్తర్ (27) దంపతులకు ప్రదీష్ (5), దేశిక (4), దర్శిక (2) తదితర ముగ్గురు కుమార్తెలు, మూడు నెలల మగబిడ్డ ఉన్నారు. పదేళ్ల క్రితం స్టెల్లా ఎస్తర్ తల్లి జయ బ్యాంక్ రుణం తీసుకుని నిర్మించిన ఇంటిని స్టెల్లా ఎస్తర్‌కు ఇచ్చింది. అలాగే, జయకు సొంతంగా గ్రామ శివారులో ఉన్న స్థలంలో పశువులను పెంచుతుంటారు. ఆమెకు తోడుగా పనిచేస్తున్న సెల్లా, అందులో లభించిన ఆదాయంతో బ్యాంక్ రుణానికి సంబంధించిన వాయిదాలు చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో, కొద్ది నెలల క్రితం స్టెల్లా ఎస్తర్ సెల్‌ఫోన్‌కు ఆన్‌లైన్ జూదంలో డబ్బులు బాగా సంపాదించవచ్చని మెసేజ్ వచ్చింది. ఈ మెసేజ్ నమ్మిన ఆమె మెసేజ్‌లోని లింక్ క్లిక్ చేసి ఆన్‌లైన్ జూదం ఆడడం ప్రారంభించింది. మొదట సదరు సంస్థ కొంత మొత్తాన్ని జమచేయడంతో, ఆశపడిన స్టెల్లా, పలువురి నుంచి సుమారు రూ.2 లక్షల వరకు అప్పులు తీసుకుని ఆన్‌లైన్ జూదం ఆడగా, అందులో నగదు మొత్తం పోయింది. దీంతో, అప్పు ఇచ్చిన వారు నగదు చెల్లించాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం. దీంతో, విరక్తి చెందిన స్టెల్లా, రెండు రోజుల క్రితం పశువులు పెంచే ప్రాంతానికి వెళ్లి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఆలంకుళం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **చోళవరం:** నారనంబేడు, కొట్టిమేడు, పెరియ కాలనీ, సెంబుశివరం, ఒరక్కాడు రోడ్డు. **అడయార్:** బీసెంట్ నగర్, మాళవియా అవెన్యూ, శాస్త్రి నగర్ 1 నుంచి 4వ వీధులు, శివగామిపురం, గంగైఅమ్మన్ ఆలయ వీధి, ఎల్ఐసీ కాలని, సుబ్రమణ్యం కాలని, 1నుంచి 3వీధులు, మాళవియా అవెన్యూ, ఎంజీ రోడ్డు, ఆర్కే నగర్ మెయిన్ రోడ్డు, 1 నుంచి 3క్రాస్‌వీధులు, ఆర్కే నగర్, మరుందీశ్వరర్ నగర్, సున్నాంబుకాల్వాయ్, కామరాజర్ నగర్, ఆర్‌బీఐ కాలని, శాస్త్రి మెయిన్ నగర్ 1వ మెయిన్ రోడ్డు, శాస్త్రి నగర్ 1, 6వ క్రాస్ వీధులు. **తరమణి:** డా.అంబేడ్కర్ పురచ్చి నగర్, గోవిందస్వామి నగర్, సెంపోన్ నగర్, జేజే నగర్, ఓల్డ్ కామరాజర్ నగర్, పెరుంతలైవర్ కామరాజ్ నగర్, సందియప్పన్ రోడ్డు, ఎంజీఆర్ రోడ్డు, వైర్‌లెస్ క్వార్టర్స్, షామీర్ ఆఫీస్. **అరుంబాక్కం:** జాయ్ నగర్ 4 నుంచి 7 వరకు, ప్రగతీశ్వర నగర్, దురైపిళ్లై వీధి, ఇందిరా గాంధీ వీధి, కవిత వీధి, నెహ్రూ వీధి మరియు నగర్, పాంచాలి అమ్మన్ ఆలయ వీధి, వీణ గార్డన్, బీవీ నగర్, న్యూ స్ట్రీట్.

శ్రీలంక వెళ్లే విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విమానంలో సాంకేతిక లోపాన్ని పైలెట్ సకాలంలో గుర్తించడంతో పెనుప్రమాదం తప్పింది. నగరం నుంచి శ్రీలంకకు 126 మంది ప్రయాణికులతో శ్రీలంక ఎయిర్‌లైన్స్ విమానం బయల్దేరేందుకు సిద్ధంగా ఉంది. విమానాన్ని రన్‌వేపై తీసుకెళ్లే సమయంలో పైలెట్ తనిఖీల్లో సాంకేతిక లోపం గుర్తించి విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు, సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేపట్టి సాంకేతికలోపం సరిచేయడంతో, ఒకటిన్నర గంట ఆలస్యంగా విమానం బయల్దేరి వెళ్లింది.

పళని ఆలయంలో న్యాయవాదితో వాగ్వాదం

● ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు అరెస్టు




రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులతో చర్చలు జరుపుతున్న పోలీసు అధికారులు - గార్డు అరెస్టును ఖండిస్తూ ధర్నాకు దిగిన ఆలయ సిబ్బంది

టి.నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పళని మురుగన్ ఆలయానికి వెళ్ళిన మహిళా న్యాయవాదితో వాగ్వాదానికి పాల్పడి ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించాడనే ఆరోపణలపై ప్రైవేటు సెక్యూరిటీ గార్డును పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పర్వతాలయం దిగువన న్యాయవాదులు ఆందోళనకు దిగటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పళని దండాయుధపాణి స్వామి పర్వతాలయంలో ప్రైవేటు సంస్థ ద్వారా పళని ఆండవర్ పూంగా రోడ్డు ప్రాంతానికి చెందిన మదురై వీరన్ (27) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం వించ్ టికెట్టు ఇచ్చే డ్యూటీ చేశారు.. ఆ సమయంలో పళని గణపతిన గర్‌కు చెందిన న్యాయవాది ప్రేమలతకు అతడికి మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది.. ఆ తర్వాత ఆమె కొండదిగి గార్డు తన పట్ల అసభ్యంగా ప్రవర్తించి దూషించి, మరో నలుగురితో కలిసి తనపై దాడికి దిగాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు మదురై వీరన్‌ను పోలీసులు విచారణకు తీసుకెళ్లారు. తన డ్యూటీకి భంగం కలిగించిందంటూ సెక్యూరిటీ గారర్డు తన తరపు న్యాయవాది ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఏకపక్షంగా మదురై వీరన్‌ను మాత్రమే అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ పళని ఆలయంలో పనిచేస్తున్న సుమారు వంద మంది సెక్యూరిటీ గార్డులు, కొండ దిగువనున్న పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. అదే సమయంలో న్యాయవాది ప్రేమలతకు మద్దతుగా మదురై వీరన్‌పై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ న్యాయవాదులు పళని కోర్టు ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ కారణంగా ఆ ప్రాంతంలో రెండు గంటలపాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. సెక్యూరిటీ గార్డు మదురై వీరన్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకునేందుకు తీసుకెళుతుండగా ఆలయ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు ఆందోళనకు దిగారు. అనంతరం పళని ఆలయ డిప్యూటీ కమిషనర్ మారిముత్తు, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మి పోలీసుస్టేషన్‌కు వెళ్ళి పోలీసు ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. సెక్యూరిటీ గార్డులు ఆందోళన జరుపుతుండటంతో ఆలయానికి వచ్చే భక్తులు రోప్‌కార్, వించ్ రైలునిలయం, బ్యాటరీ కారు సేవలు స్తంభించడంతో ఇబ్బందుల పాలయ్యారు. ఇదిలా ఉండగా సెక్యూరిటీ గార్డు, మహిళా న్యాయవాది మధ్య జరిగిన గొడవకు సంబంధించి ఓ భక్తుడు రహస్యంగా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో, సెక్యూరిటీ గార్డు మదురై వీరన్ ఎలాంటి తప్పు చేయలేదని స్పష్టమైంది.

25 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురు ఉత్తరాది యువకుల అరెస్ట్

తిరుత్తణి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి హైవే చెక్‌పోస్ట్ ప్రాంతంలో శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు, సుమారు 25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే తిరుత్తణి-చెన్నై జాతీయ రహదారిపై కొంతమంది యువకులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో శనివారం సాయంత్రం నిఘా వేసిన పోలీసులు, అనుమానాస్పదంగా సంచరించిన ముగ్గురు ఉత్తరాది యువకులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి 25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు త్రిపురకు చెందిన ఆకాష్ (38), అస్సాంకు చెందిన సునీల్‌దాస్ (29), శంకర్ (35)గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలపై కేసు నమోదుచేసి ముగ్గురు ఉత్తరాది యువకులను కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

కుక్కర్ పేలి మహిళ మృతి

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వంట చేస్తుండగా కుక్కర్ పేలి మహిళ మృతిచెందిన ఘటన స్థానిక తిరువొత్తియూర్‌లో శనివారం చోటుచేసుకుంది. తిరువొత్తియూర్ శరవణ నగర్ మొదటి వీధికి చెందిన ఆర్ముగం-రాజ్యలక్ష్మి (55) దంపతులకు యువరాజ్ అనే కుమారుడు, తన్య అనే కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో, యువరాజ్ తన ఇంట్లో ఏసీ రిపేరు చేసేందుకు శనివారం మధ్యాహ్నం తన స్నేహితుడిని తీసుకొచ్చాడు. తన స్నేహితుడికి బోజనం చేసి పెట్టాలని తల్లికి తెలిపారు. దీంతో రాజ్యలక్ష్మి స్టవ్‌పై కుక్కర్ పెట్టింది. చాలాసేపటి వరకు కుక్కర్ విజిల్ రాకపోవడంతో, రాజ్యలక్ష్మి దగ్గరకు వెళ్లి చూస్తున్న సమయంలో ఊహించని విధంగా కుక్కల్ పేలింది. పేలుడుకు కుక్కర్ మూత ఎగిరి రాజ్యలక్ష్మి మొఖంపై బలంగా తాకడంతో ఆమె వెనక్కి పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే తిరువొత్తియూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికత్స ఫలించక మృతిచెందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

● పోక్సో చట్టం కింద టీచర్ అరెస్ట్

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు పోక్సో చట్టం కింద కటకటాలపాలయ్యాడు. సేలం కడయాంపట్టి ప్రాంతంలోని ఓ మాధ్యమిక పాఠశాలలో ఐదుగురు బాలికలపై ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు అందింది. హెచ్‌ఎం జరిపిన విచారణలో లైంగిక వేధింపులు వాస్తవమని తెలియడంతో, ఆయన ఓమలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు తంగవేల్ (43) పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నీటమునిగి ముగ్గురు బాలుర మృతి

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలో నీటమునిగి ముగ్గురు బాలురు మృతిచెందిన ఘటన విషాదం నింపింది. గ్రామంమేట్టు ప్రాంతానికి చెందిన భువనేశ్వరన్ (7), మోనిప్రసాద్ (9), భజన్ (7)ఆదివారం సెలవు రోజు కావడంతో సమీపంలోని చెరువులో స్నానాలకు వెళ్లారు.వారుస్నానం చేస్తూ ఊహించని విధంగా లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగారు. గమనించిన చుట్టుపక్కల వారు వీరిని రక్షించి బానావరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై బానావరం పోలీసులు కేసు నమోదుచేశారు.

డ్రైవర్‌కు గుండెపోటు

● అదుపుతప్పిన బస్సు ఢీకొని ఒకరి మృతి

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రభుత్వ బస్సు నడుపుతున్న డ్రైవర్ హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. ఆ సమయంలో అదుపుతప్పి అడ్డదిడ్డంగా వెళ్లిన బస్సు ఢీకొని ఒకరు మృతిచెందారు. మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన బస్సు కిలాంబాక్కం నుంచి కోయంబేడు వెళుతోంది. ఆ సమయంలో బస్సు డ్రైవర్ హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. అరుంబాక్కం వందడుగుల రోడ్డులో బస్సు అదుపుతప్పి కారు, పాదచారుడిని ఢీకొంది. ఈ ఘటనలో రోడ్డుపై నడచి వెళుతున్న 50 ఏళ్ల వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గాయపడిన వ్యక్తిని, గుండెపోటుకు గురైన డ్రైవర్‌ను అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నాటు మందుతిని ఇద్దరు చిన్నారుల మృతి



మృతులు రేష్మ, ధనుశ్రీ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జ్వరానికి నాటు మందు తీసుకున్న ఇద్దరు చిన్నారులు మృతిచెందిన ఘటన పెరంబలూరు జిల్లాలో చోటుచేసుకుంది. వాలికండాపురం గ్రామానికి చెందిన కందస్వామి-ధనలక్ష్మి దంపతులకు ఏడాదిన్నర వయస్సు కుమారుడు, 11 నెలల రేష్మ, ధనుశ్రీ అనే ఇద్దరు కుమార్తెలున్నారు. కొద్దిరోజులుగా కుమార్తెలు జ్వరంతో బాధపడుతున్నట్లు సమాచారం. గ్రామంలో నాటు వైద్యుడి నుంచి ఈ నెల 11వ తేది నాటు మందు తీసుకొచ్చి పిల్లలకు అందించారు. కొద్దిసేపటి అనంతరం రేష్మ మృతిచెందింది. అనారోగ్యంతో బాధపడుతున్న ధనుశ్రీని తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా శనివారం సాయంత్రం మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసి పోలీసులు ఇది శిశు హత్యా? నాటు మందు కారణమా? అంటూ తల్లి ధనలక్ష్మి, బామ్మ శాంతి, నాటు వైద్యుడు సైదానిలను విచారిస్తున్నారు.

గంజాయి విక్రయించిన 10 మంది అరెస్ట్

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదురవాయల్ ప్రాంతంలో చట్టవిరుద్ధంగా గంజాయి, మత్తు బిల్లలు, ఇంజక్షన్లు విక్రయించిన 10 మందిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో నిషేధిత మాదకద్రవ్యాల విక్రయాన్ని అడ్డుకునే చర్యలు ముమ్మరం చేయాలని పోలీస్ కమిషనర్ అరుణ్ నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు ఉత్తర్వులు జారీచేశారు. ఆ మేరకు రంగంలోకి దిగిన ఎక్సైజ్ పోలీసులు మాదకద్రవ్యాలను విక్రయించే వారి కదలికలపై నిఘా వేశారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం మధురవాయల్ కామాక్షినగర్ రెండవ మెయిన్‌రోడ్డులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు అక్కడ మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుండి 5.25 గ్రాముల మత్తు బిల్లలు, 53 గ్రాములు వోజీ గంజాయి, 350 గ్రాముల గంజాయి, రూ.50వేల నగదు, ఓ బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం వారిని కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఖైదీ పరార్

● ముగ్గురు జైలు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

అడయార్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి కేంద్ర కారాగారం నుంచి ఓ ఖైదీ తప్పించుకుని పారిపోయాడు. దీనికి సంబంధించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు జైలు సిబ్బందిని జైలు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కుంభకోణంకు చెందిన రాజేంద్రన్ (48) అనే వ్యక్తి వివిధ నేరాలకు పాల్పడిన కేసులో తిరుచ్చి సెంట్రల్ జైలులో విచారణ ఖైదీగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఈ ఖైదీ జైలు సిబ్బంది కళ్ళుగప్పి తప్పించుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన జైలు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు... ఆ ఖైదీని అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి జైలు హెడ్ కానిస్టేబుల్ జస్టిన్, కానిస్టేబుళ్ల దినేష్, షణ్ముగరాజాలను జైలు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

సతీమణితో కలిసి చెన్నైకి రాందాస్

అడయార్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్.. ఆదివారం తన సతీమణితో కలిసి చెన్నై వచ్చారు. విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో ఉండే రాందాస్... అకస్మాత్తుగా చెన్నై నగరానికి రావడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొన్ని రోజులుగా రాందాస్, కుమారుడు అన్బుమణి మధ్య రాజకీయ ఆధిపత్యపోరు సాగుతోంది. ఈ క్రమంలో పార్టీ నుంచి అన్బుమణిని బహిష్కరించారు. మరోవైపు, అన్బుమణికి చెందిన మద్దతుదారులందరినీ పార్టీ పదవుల నుంచి తప్పించి, కొత్తవారిని నియమించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన తన సతీమణితో కలిసి చెన్నై వచ్చారు. మాజీ మంత్రి ఏకే మూర్తి ఇంటి శుభకార్యానికి హాజరయ్యేందుకు రాందాస్ దంపతులు చెన్నై వచ్చారని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.



కొత్త చిత్రం పూజా కార్యక్రమం

'నాయ్ శేఖర్' ఫేం హీరోగా కొత్త చిత్రం

నాయిస్ అండ్ గ్రైన్స్ నిర్మాణంలో 'నాయ్ శేఖర్' ఫేం కిషోర్ రాజ్‌కుమార్ కథ సమకూర్చి, దర్శకత్వం వహించి, హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం సంప్రదాయ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. మలయాళ నటి అన్నాబెన్ హీరోయిన్. దేశంలో ప్రముఖ మీడియా ప్రొడక్షన్ హౌస్, టాలెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా గుర్తింపు పొందిన నాయిస్ అండ్ గ్రైన్స్ చిత్రపరిశ్రమలో అనేక మెగా ఈవెంట్స్‌ను ఎంతో విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన ఈ సంస్థ కిషోర్ రాజ్‌కుమార్ హీరోగా ఈ చిత్రాన్ని రూపొందిస్తోంది. 'కోమాలి', 'ఖైదీ', 'వీఐపీ-2', ఇమైక్క నొడిగల్, 'కీ' వంటి అనేక చిత్రాల్లో నటించిన కిషోర్ రాజ్‌కుమార్ 'నాయ్ శేఖర్‌'తో దర్శకుడిగా అరంగేట్రం చేశారు. ఇపుడు ఇంకా పేరు పెట్టని ఈ చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్ర వివరాలను ఆయన వివరిస్తూ, 'లవ్, కామెడీతో నిండిన కథ. సినిమా ఆద్యంతం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చేలా స్క్రీన్‌ప్లే రూపొందించాం. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడానికి ప్రధాన కారణం కె.భాగ్యరాజ్. ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలు ఇపుడు లేవన్న భావన ప్రేక్షకుల్లో వుంది. ఆ లోటు ఈ చిత్రం తీరుస్తుంది. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

కోలీవుడ్‌లో విషాదం...

స్టంట్ ఆర్టిస్ట్ రాజు మృతి



ఎస్.ఎం.రాజు (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తమిళ చిత్రపరిశ్రమలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. కోలీవుడ్‌కు చెందిన స్టంట్ ఆర్టిస్ట్ ఎస్.ఎం.రాజు (52) గుండెపోటుతో మృతి చెందారు. ప్రముఖ దర్శకుడు పా.రంజిత్, హీరో ఆర్య కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మూవీ షూటింగ్ నాగపట్టణం జిల్లాలో జరుపుతున్నారు. చిత్రీకరణలో భాగంగా హైరిస్క్ ఫైట్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో రాజు గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషాద వార్త తెలుసుకున్న నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ తన ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలోనే కాకుండా భవిష్యత్‌లో కూడా రాజు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తూ, తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. అలాగే, కోలీవుడ్ స్టంట్ ఆర్టిస్ట్ యూనియన్ ప్రతినిధులు కూడా తమ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు.

గిరిజనుల బాధలు చెప్పే 'గెవి'

● 18న విడుదల

చిత్రజ్యోతి



'గెవి'లో ఓ దృశ్యం

గిరిజనుల బాధలు వివరించే చిత్రంగా 'గెవి' రూపొందించామని, ఈ చిత్రాన్ని ఈ నెల 18వ తేదీ విడుదల చేస్తున్నామని ఆ చిత్ర దర్శకుడు తమిళ్ దయాళన్ వెల్లడించారు. ఆర్ట్ అఫ్ ట్రయాంగిల్స్ ఫిల్మ్ మేకింగ్ కంపెనీ పతాకంపై నిర్మితమైన ఈ చిత్రంలో ఆదవన్ అనే వర్ధమాన నటుడు హీరోగా తొలిసారి పరిచయమవుతున్నారు. 'టూలెట్', 'మండేలా' ఫేమ్ షీలా రాజ్‌కుమార్ హీరోయిన్. ఇతర పాత్రలను జాక్విలిన్, చార్లెస్ వినోద్, చిదంబరం, ధర్మదురై జీవా, వివేక్ మోహన్, ఉమర్ ఫరూక్ తదితరులు పోషించారు. దిండిగల్ జిల్లా కొడైక్కెనాల్ కొండ ప్రాంతంలో ఉన్న గెవి అనే గ్రామం చుట్టూ, ఆ ప్రాంతంలో నివసించే ప్రజల జీవితాలను తెలియజెప్పే చిత్రంగా తెరకెక్కించాం. ఈ చిత్రం గురించి దర్శకుడు తమిళ్ దయాళన్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరూ పర్వత లేదా కొండ ప్రాంతాల సందర్శనకు వెళ్ళినపుడు అక్కడి రమణీయమైన ప్రకృతి ఆస్వాదించి వెళ్ళిపోతాం. కానీ, ఆ ప్రకృతితో మమేకమై జీవించే ఆ ప్రాంత ప్రజల కష్టనష్టాలు, వారి జీవితాలపై మనం దృష్టిసారించం. అలాంటి వారు మన దృష్టిలో కనిపించరు. అటువంటి వ్యక్తుల జీవితాల్లోని కష్టాలు, బాధలను వివరించే చిత్రంగా 'గెవి' ఉంటుంది. ఈ చిత్రాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళాలని దర్శక నటుడు అమీర్ అన్నారు. ఆయన అలా ఎందుకు అన్నారన్నది ఈ సినిమా చూసిన తర్వాత ప్రతి ఒక్కరికీ అర్థమవుతుంది. కొండ ప్రాంత ప్రజల కేకలు ప్రపంచం వినాలి. వారిని జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే ఈ చిత్ర సారాంశం' అన్నారు.

జీవితాలతో ఆడుకోవద్దు

● అనల్ అరసు వినతి



అనల్ అరసు, సూర్య సేతుపతి

ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని ట్రోల్స్ చేయడం వల్ల ఆ వ్యక్తి జీవితం మాత్రమేకాకుండా అనేక మంది జీవితాలతో మీరు ఆడుకున్నట్టేనని ప్రముఖ స్టంట్‌మాస్టర్, సినీ దర్శకుడు అనల్ అరసు అన్నారు. ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి తనయుడు సూర్య హీరోగా పరిచయం చేస్తూ అనల్ అరసు నిర్మించిన చిత్రం 'ఫీనిక్స్'. ఇటీవల విడుదలకాగా, ఈ మూవీ సక్సెస్ వేడుకలు తాజాగా నగరంలో నిర్వహించారు. ఇందులో హీరో సూర్య సేతుపతి, దర్శకుడు అనల్ అరసు, నిర్మాత రాజ్యలక్ష్మి అనల్ అరసుతోపాటు చిత్రంలో నటించిన నటీనటులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, '32 యేళ్ళపాటు స్టంట్ మాస్టర్‌గా పనిచేసిన తర్వాత సినిమాకు దర్శకత్వం వహించాను. ఈ స్థాయికి చేరుకోవడానికి పలుమార్లు ఫైట్ మాస్టర్‌గా ప్రాణాలను పణంగా పెట్టాను. ఒక సినిమా విజయం ఒకరికి మాత్రమే లబ్ధి చేకూర్చదు. అందులో నటించిన నటులకు, సాంకేతిక నిపుణులందరికీ ప్రయోజనం చేకూర్చుతుంది. సూర్యను విమర్శించే వారికి, ట్రోల్స్ చేసే వారికి ఒక విన్నపం. ట్రోల్స్ వల్ల ఒకరి జీవితాన్ని నాశనం చేయొద్దు. 'ఫీనిక్స్' హీరో సూర్యను టార్గెట్ చేస్తున్నారని మీరు భావించవచ్చు. కానీ, ఆ సినిమా కోసం శ్రమించిన ప్రతి ఒక్కరి జీవితాలతో ఆడుకుంటున్నారు. ఏదైనా ఒక చిత్రాన్ని ఒక హీరో చిత్రంగా చూడొద్దు.. అందులో నటించిన ప్రతి ఒక్కనటుడి చిత్రంగా చూడండి. ఫీనిక్స్ స్టోరీ సూర్య కోసం రాయలేదు. కానీ, ఈ సినిమా కోసం అతను పడిన కష్టానికి హ్యాట్సాఫ్. సూర్యకు గొప్ప భవిష్యత్ ఉంది' అన్నారు.

తిరుప్పరంకుండ్రానికి బయలుదేరిన

మీనాక్షి సుందరేశ్వరులు

● నేడు మహా కుంభాభిషేకం



తిరుప్పరం కుండ్రం రాజగోపురంపై స్వర్ణకాంతులతో మెరుస్తున్న కలశం. ఇన్‌సెట్‌లో మీనాక్షి, సుందరేశ్వరులు

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలో ప్రసిద్ధి శైవక్షేత్రమైన తిరుప్పరకుండ్రంలో 14యేళ్ళ అనంతరం సోమవారం నిర్వహించనున్న మహాకుంభాభిషేకంలో పాల్గొనేందుకు మీనాక్షి అమ్మవారి సమేత సుందరేశ్వర్లు ఆదివారం మేళతాళాలు, వేదమంత్రోచ్చారణ మధ్య బయలుదేరి వెళ్ళారు. సుబ్రహ్మణ్యస్వామి రాష్ట్రంలో కొలువుదీరిన ఆరు ప్రధాన క్షేత్రాల్లో మొదటిదైన తిరుప్పరకుండ్రంలో మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు నిర్ణయించిన హిందూ దేవాదాయశాఖ జీర్ణోద్ధరణ పనుల కోసం రూ.2.36 కోట్లు కేటాయించింది.ఇందులో రూ.9 లక్షలతో ఆలయ గోపురాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. గర్భగుడి, ప్రాకార మండపాలు, శాలాహారాలు, ప్రధాన మండపాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ఇత్తడి రాడ్లతో క్యూలైన్లు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించారు. ఆలయ ప్రాంగణంలో 75 హోమ గుండాలు ఏర్పాటు చేసి, ఈ నెల 10వ తేదీ ఉదయం నుంచి శివాచార్యుల యాగ పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆరు,ఏడు జాముల పూజలు, పవిత్ర జలాలు నింపిన కలశాలకు విశేషపూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారు జామున 3.30 గంటలకు ఎనిమిదో జాము పూజలు నిర్వహించి, 150 తీర్థ కలశాలకు 85 మంది శివాచార్యులు తమిళంలో వేద పారాయణం చేస్తారు. ఉదయం 5.25 గంటలకు ఆలయ ప్రధాన గోపురంలోని ఏడు కలశాలపై పవిత్ర జలాలు సంప్రోక్షించి మహాకుంభాభిషేకం నిర్వహిస్తారు. అదే సమయంలో ఆలయంలోని ఇతర సన్నిధులకు కుంభాభిషేకం జరుగుతుంది. ఉదయం 6.10 గంటలకు గర్భాలయంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామివారికి మహాభిషేకం,దీపారాధన పూజలు చేస్తారు. ఇదిలా వుండగా, ఆదివారం ఉదయం మదురై మీనాక్షి అమ్మవారి ఆలయం నుంచి మీనాక్షి అమ్మవారి సమేత సుందరేశ్వరుడు పంచమూర్తులతో తిరుప్పరకుండ్రం క్షేత్రానికి బయలుదేరారు. సోమవారం కుంభాభిషేకోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చి మళ్ళీ రాత్రి అక్కడి నుంచి బయలుదేరి మదురై చేరుకుంటారు.ఇందువల్ల ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం రోజంతా దేవేరుల దర్శనం రద్దు చేస్తున్నట్లు హిందూ దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. 15వ తేదీ యథావిధిగా తెల్లవారుజాము నుంచి భక్తులను ఆలయంలోకి అనుమతించనున్నట్లు వారు పేర్కొన్నారు.



తిరుప్పరంకుండ్రం కుంభాభిషేకం ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు



వార్షికోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

ఘనంగా వాసవీ క్లబ్ చెన్నపట్న 15వ వార్షికోత్సవం

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ చెన్నపట్న-వనితా చెన్నపట్న 15వ వార్షికోత్సవం ఆదివారం ఎగ్మూర్‌లోని ప్రెసిడెన్సీ క్లబ్‌లో ఘనంగా జరిగింది. ప్రస్తుత ప్రెసిడెంట్లు హెచ్ బాలాజీ-పూర్ణిమ దంపతుల అధ్యక్షత జరిగిన ఈ వేడుకల్లో 15యేళ్ళ క్రితం ఈ క్లబ్‌లను ప్రారంభించిన ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షులు సౌభాగ్య, వి.ఆదికేశవన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్ఞాపికలు, బహుమతులు అందించి, అభినందించారు. ముందుగా వాసవీ క్లబ్ చెన్నపట్న డిస్ట్రిక్ వి-502ఏ రిజియన్ 2 జూన్ 2 మొదటి అధ్యక్షుడు దివంగత రామ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించి అంజలి ఘటించారు. రామానుజం, నామా సతీష్‌కుమార్, సత్యనారాయణ, ఇమ్మిడి కిషోర్, డాక్టర్ ఎంఎస్ చంద్రగుప్తా, రత్నకుమార్, జిల్లా గవర్నర్ సీఎం రాజేష్ దంపతులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆదికేశవన్ మాట్లాడుతూ, తన చేతుల మీదుగా ప్రారంభించిన క్లబ్‌ల తరుపున గత 15యేళ్ళగా సమాజానికి అంకిత భావంతో సేవలందించడం ప్రశంసనీయమన్నారు. కొత్త క్లబ్‌లు ప్రారంభించేందుకు అందరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా హెచ్ బాలాజీ-పూర్ణిమ, డాక్టర్ చంద్రగుప్తా మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి, వెయ్యి మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయడం ప్రశంసిస్తూ బుసీ పాలస్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సంస్థ ప్రతినిధులు క్లబ్ నిర్వాహకులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

● వచ్చే ఎన్నికల్లో గెలుపు మాదే ● డిప్యూటీ సీఎం ఉదయనిధి



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

అడయార్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వం మహిళా సంక్షేమానికి, పురోభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, అందువల్ల వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు మాదేనని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జోస్యం చెప్పారు. తిరువణ్ణామలై జిల్లాలో మంత్రి ఏవీ వేలు ఇంటి శుభకార్యంలో ఆయన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్రంలో మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎలాంటి పథకాలు చేపట్టాలో సీఎంగా స్టాలిన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రూపకల్పన చేసి ద్రావిడ మోడల్ ప్రభుత్వంలో అమలు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన విజయాన్నే 2026లో జరిగే ఎన్నికల్లోనూ అందించాలని ఆయన కోరారు. అందుకే ముఖ్యమంత్రి స్టాలిన్ 'ఏకతాటిపైకి' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారని ఆయన గుర్తు చేశారు ద్రావిడ మోడల్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో వచ్చే ఎన్నికల్లో మళ్ళీ గెలిచి అధికారంలోకి వస్తామని ఉదయనిధి ధీమా వ్యక్తం చేశారు.

డిసెంబర్‌లోగా 3500 ఆలయాలకు

కుంభాభిషేకం

● మంత్రి పీకే శేఖర్‌బాబు



ఈరోడ్ సమీపం తిండల్ పర్వతం వద్ద 186 అడుగుల మురుగన్ విగ్రహం నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, సామినాథన్

చెన్నై, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ తరహా డీఎంకే పాలనలో వేల సంఖ్యలో ప్రాచీన ఆలయాలన్నీ కొత్త రూపు సంతరించుకున్నాయని దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఇప్పటికే మూడువేలకు పైగా ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహించిన దేవాదాయ శాఖ డిసెంబర్ నెలాఖరులోగా 3500 ఆలయాలకు జీర్ణోద్ధరణ పనులు చేపట్టి కుంభాభిషేకాలు నిర్వహించనున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఈరోడ్ సమీపం దిండల్ పర్వతం వద్దనున్న వేలాయుధసామి ఆలయం ఎదురుగా 186 అడుగుల ఎత్తులో మురుగన్ విగ్రహం నిర్మాణ పనులను మంత్రుల సామినాథన్, శేఖర్‌బాబు ప్రారంభించారు. ఆ సందర్భంగా శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుండి ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు అడిగిందే తడవుగా ముఖ్యమంత్రి స్టాలిన్ నిధులను మంజూరు చేస్తున్నారని, అందువల్లే వేల సంఖ్యలో ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించగలిగామని చెప్పారు. ఇప్పటి వరకూ ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు రూ.1120 కోట్ల మేర నిధులు విడుదలయ్యాయని చెప్పారు. పళని రెండో విడత అభివృద్ధి పనులకు రూ.58 కోట్ల మేర నిధులు విడుదలయ్యాయని చెప్పారు. తిరుచెందూరు ఆలయం వద్ద 14 యేళ్ల తర్వాత రూ.414 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించి 75 శాతం పనులు పూర్తిచేశామన్నారు. నవంబర్‌లోగా తక్కిన 25 శాతం పనులు కూడా పూర్తవుతాయన్నారు. తిరుత్తణి మురుగన్ ఆలయానికి ఆంధ్రప్రదేశ్ నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తుండటంతో కొండపైకి రెండో రహదారి నిర్మించనున్నామని చెప్పారు. ఇక ఈరోడ్ తిండల్ ప్రాంతం వద్ద ఆసియాలోనే అత్యంత ఎత్తుకలిగిన మురుగన్ విగ్రహాన్ని నిర్మించనుండటం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు.

అయ్యనార్ ఆలయం



ఆడి అమావాస్య ఉత్సవాలకు అయ్యనార్ ఆలయం ముస్తాబు

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కారయార్ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన అయ్యనార్ ఆలయం ఆడి అమావాస్య ఉత్సవాలకు ముస్తాబవుతోంది. కొండపై రమ్యమైన ప్రకృతి వాతావరణం, జలపాతాల మధ్యనున్న ఈ ఆలయంలో ఆడి అమావాస్య, పంగుణి ఉత్తిరం ఉత్సవాలను ప్రతిఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. వ్రతం చేపట్టిన లక్షలాది మంది భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు చెల్లించివెళుతుంటారు. అంతేకాకుండా కులదైవం ఎవరో తెలియని భక్తులు అయ్యనార్ స్వామివారిని తమ కులదైవంగా భావించి పూజిస్తుంటారు. ఈ ఏడాది ఈ నెల 24న ఆడి అమావాస్య ఉత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం ఉదయం స్తంభస్థాపనతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఆడి అమావాస్య రోజున ఈ ఆలయంలో తీర్థవారీ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 24,25వ తేదీల్లో సాయంత్రం 5 గంటలకు బ్రహ్మాక్షి అమ్మవారి సన్నిధి, తలవాయి మాడస్వామి సన్నిధి, పట్టవరాయన్ సన్నిధుల ముందు భక్తులు అగ్నిగుండంలో దిగి, స్వామివారిని దర్శనం చేసుకుంటారు. 26న సింగంపట్టి జమీందారు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని హిందూ దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.

పార్టీలను చీల్చడంలో ఆరితేరిన బీజేపీ

● టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుంతగై ధ్వజం



గుడియాత్తంలో మీడియాతో మాట్లాడుతున్న టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై

టి.నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పార్టీలను చీల్చడంలో బీజేపీ బాగా ఆరితేరిందని, గత ఎన్నికల్లో అన్నాడీఎంకేని నాలుగు ముక్కలుగా చీల్చిన ఆ పార్టీ ప్రస్తుతం పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే)ని రెండు ముక్కలుగా చీల్చిందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై విమర్శించారు. గుడియాత్తంలో జరిగిన పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ డీఎంకే కూటమి కంచుకోటలా ఉందని, ఆ కూటమిని ఎవరూ చీల్చలేరని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు బీసీలు, ఎంబీసీలు తదితర బలహీన వర్గాల మధ్య సమైక్యత నెలకొల్పేందుకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, ఈ విషయాన్నే తాను పీఎంకే నేత రాందాస్‌ను కలుసుకున్నప్పుడు వివరించారని చెప్పారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకి గులాముగా వ్యవహరిస్తూ డీఎంకే పాలనపై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. బీజేపీతో పొత్తుపెట్టుకున్న అన్నాడీఎంకేని రాష్ట్ర ప్రజలంతా చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. బీజేపీ అన్ని రాష్ట్రాల్లోనూ ప్రతిపక్ష పార్టీలను చీల్చడమే పనిగా పెట్టుకుందని సెల్వపెరుంతగై ఆరోపించారు. ఓ వైపు అమిత్‌షా రాష్ట్రంలో ఎన్డీయే గెలిస్తే సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఆ ప్రభుత్వంలో బీజేపీ అధికార భాగస్వామ్యం ఉంటుందని చెబుతుండగా,మరో వైపు ఎడప్పాడి పళనిస్వామి అసెంబ్లీ ఎన్నికల్లో సొంతమెజారిటీతోనే అధికారంలోకి వస్తామని చెబుతుండటం వింతగా ఉందని, వీరి మాటలతో బీజేపీ, అన్నాడీఎంకే నేతల మధ్య అయోమయం చోటు చేసుకుంటోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లకు పైగా గెలుచుకుంటుందని జోష్యం చెప్పారు.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ఎన్నడో ప్రారంభించిందని, త్వరలో జాతీయ నాయకులు ప్రచారం చేయడానికి రాష్ట్రానికి విచ్చేయనున్నారని తెలిపారు. మీడియా సమావేశంలో మాజీ శాసనసభ్యుడు పీటర్ ఆల్ఫోన్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వినాయకాలయంలో బాలాలయం



పవిత్ర జలకలశాల ఊరేగింపులో ఆలయ అధికారులు, నిర్వాహకులు

ప్యారీస్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట సమీపంలో మింట్ స్ట్రీట్‌లో ప్రసన్న వినాయకుడి ఆలయంలో ఆదివారం బాలాలయ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహా గణపతి పూజ, అంకురార్పణం, మహాకుంభవేదిక పూజలు, రెండో జాము యాగపూజలు, పూర్ణాహుతిని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి మూలవిరాట్టు ప్రసన్న వినాయకుడు, పరివార మూర్తులను పవిత్ర జలాలతో అభిషేకించి, దీపారాధనతో బాలాలయం ప్రారంభించారు. ఆలయ అధికారులు ముల్లై, శివకుమార్, నర్‌చోలై, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ 5వ జోన్ ఛైర్మన్ పి.శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ ఎస్ మురళి, రంగనాథస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జె.హరికుమార్ తదితరులు బాలాలయం పూజల్లో పాల్గొన్నారు.

మురుగన్ సేవలో సింగపూర్ హోంమంత్రి



సింగపూర్ హోంమంత్రి షణ్ముగం

తిరుత్తణి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయాన్ని ఆదివారం ఉదయం సింగపూర్ హోంమంత్రి కె.షణ్ముగం దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయన భారీ పోలీసు బందోబస్తు మధ్య తిరుత్తణి చేరుకున్నారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రతిఏటా తిరుత్తణి వచ్చి, స్వామివారిని దర్శించుకుంటానని, స్వామిని దర్శిస్తే మనసుకు హాయిగా ఉంటుందని, ఆ దేవదేవుని కృప వల్లే తను ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. అర్చకులు, ఆలయ నిర్వాహకులు సింగపూర్ హోంమంత్రిని ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.



గిండిరాజ్‌భవన్‌లో ఆదివారం జరిగిన వైద్యుల దినోత్సవంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి నుంచి సత్కారాలు అందుకున్న ప్రముఖ వైద్యనిపుణులు